క్లుప్తంగా

ఆరోగ్యకరమైన పంటలను పండించాలి



చాట్రాయి: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని చాట్రాయి సర్పంచ్ దామెర ఉషా తెలిపారు. స్థానిక సచివాయంలో ఎస్సీ రైతులకు ఉచితంగా కూరగాయ విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శివ శంకర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజేశ్వరి, రాముురాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంతెన పరిశీలన



జి.కొండూరు: మండలంలోని హెచ్ ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల నడుమ బుడమేరుపై ఉన్న వంతెనను ఆర్అండ్‌బీ అధికారులు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ రెండు గ్రామాల నడుమ శిథిలావస్థకు చేరిన పాత వంతెనకు పక్కన ఇటీవల ఏర్పాటు చేసిన లోలెవెల్ చప్టాకు ఒక పక్కన అప్రోచ్‌రోడ్డు వరద ఉద్ధృతికి కొట్టుకు పోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో వంతెనను పరిశీలించిన ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయశ్రీ, వరద ఉద్ధృతి పూర్తిగా తగ్గిన తర్వాత అప్రోచ్‌రోడ్డును ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్అండ్‌బీ ఈఈ ఏడుకొండలు, డీఈ అప్పారావు, జేఈ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.10 వేల పింఛన్ అందజేత



జి.కొండూరు: జి.కొండూరు గ్రామానికి చెందిన పల్లె ప్రేమ్‌కుమార్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కాగా అతడికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నూతనంగా మంజూరైన రూ.10 వేలు పింఛన్‌ను ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, సర్పంచ్ అరుణ చేతులమీదుగా మంగళవారం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



గంపలగూడెం: గంపలగూడెం షిరిడి సాయిబాబా ధ్యాన నిలయంలో పౌర్ణమి సందర్భంగా నంద దీపోత్సవం మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిపారు. భక్తులు బాబా విగ్రహాన్ని పల్లకిలో ఉంచి మోస్తూ, నంద దీపాలతో ఆలయం చుట్టూ 11 ప్రదక్షిణలు చేశారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం స్వామి మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందంచే రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. 14మంది దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యుడు నూకల నాగలక్ష్మరావు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: నెమలి శ్రీవేణుగోపాలస్వామి మాస కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం తిరువూరు రాజుపేటలోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో నిర్వహించారు. శ్రావణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆలయ వేదపండితులు తిరునగరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో 240 మంది దంపతులు శాస్త్రోక్తంగా స్వామి కల్యాణాన్ని జరిపారు. ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, వెంకటకృష్ణ, వీరప్రసాద్, సంకా రాధాకృష్ణ, కార్యనిర్వహణాధికారి శ్రీరామ వరప్రసాదరావు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పట్టణ పేదలకు అందుబాటులోకి వైద్యసేవలు

- కోనేరుపేటలో వైఎస్సార్ అర్బన్ క్లినిక్ నిర్మాణం పూర్తి
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే వెంకటప్రతాప్‌అప్పారావు



కోనేరుపేటలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన వైఎస్సార్ అర్బన్ క్లినిక్ భవనం

నూజివీడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే పట్టణంలోని పేదలందరికీ వైద్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నూజివీడుకు రెండు వైఎస్సార్ అర్బన్ క్లినిక్(అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్)లను మంజూరు చేసి, వాటికి శాశ్వత భవనాలను నిర్మించేందుకు ఒక్కొక్కదానికి రూ.80 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులతో పట్టణంలోని కోనేరుపేటలో నిర్మించిన ఆస్పత్రి భవనం పూర్తికావడంతో బుధవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించనున్నారు. ఇప్పటికే అద్దె భవనంలో నడుస్తున్న వైఎస్సార్ అర్బన్ క్లినిక్ సొంత భవనంలోకి రానుంది. పురపాలక సంఘం పరిధిలోని శివారు కాలనీ ప్రజలు దూరంగా ఉన్న ఏరియా ఆస్పత్రికి వెళ్లలేరనే ఉద్దేశంతో వారికి మరింత చేరువగా వైద్య సేవలందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది.

10 వసతులతో కూడిన శాశ్వత భవనం

అరకొర వసతులు నడుమ అద్దె భవనాల్లో నడిపితే పేదలకు సరైన వైద్యసేవలు అందవనే ఉద్దేశంతో 10 వసతులతో కూడిన శాశ్వత ఆస్పత్రి భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. ఇందులో ఫార్మసీ, ఔట్ పేషెంట్ గదులు, రెండు శస్త్రచికిత్స గదులు, ల్యాబొరేటరీ, రోగుల సహాయకులకు విశ్రాంతి గదులు, వైద్యుల గది ఉన్నాయి. వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లను ప్రభుత్వం నియమించింది. అన్ని రకాల రక్తపరీక్షలు ఇక్కడ ఉచితంగా నిర్వహిస్తారు.

ఉచితంగా మందులు

కోనేరుపేటలోని వైఎస్సార్ అర్బన్ క్లినిక్ కోసం నిర్మించిన శాశ్వత భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యసేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. అన్ని రకాల జనరల్ వ్యాధులకు చికిత్సను అందజేయడమే కాకుండా ఉచితంగా మందులను అందజేస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యులు ఇక్కడ అందుబాటులో ఉంటారు. పేదలకు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే అవసరం తప్పుతుంది.

అధికారులు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే రక్షణనిధి



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: విద్యుతు సరఫరాకు సంబంధించి గ్రామాల్లో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేలా అధికారులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మండల స్థాయి అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత లైన్లకు సంబంధించి వచ్చే సమస్యలను, గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఒక్కొక్క సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున 15 సచివాలయాలకు రూ.3 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, విద్యుతుస్తంభాలు, లైన్లు ఏర్పాటు, తాగునీటికి అవసరమైన పైపులైన్ల మర్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నరసాపురం, కొర్లమండ గ్రామాల్లో సీసీ రోడ్డులు ఏర్పాటు పూర్తయిందన్నారు. మిగతా సచివాలయాల్లో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఉపాధిహామీ పథకంలో సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.60 లక్షలకు ప్రతిపాదనలు పంపామన్నారు. మండలంలో చాలా గ్రామాల్లో సచివాలయాల భవన నిర్మాణం పూర్తయిందని కొన్ని గ్రామాల్లో చివరి దశలో ఉన్న పనులు పూర్తి చేసి ప్రాంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, ఏడీ నారాయణ, ఎంఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

పాడిగేదెల పంపిణీకి లబ్ధిదారులను ఎంపిక చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పిచ్చిరెడ్డి

గంపలగూడెం: వైఎస్సార్ చేయూత పథకం కింద మండలంలో పాడిగేదెల పంపకానికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. గంపలగూడెం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం వీఓఏలు, సచివాలయం కార్యదర్శులు, పంచాయతీ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి 1,600 గేదెల యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఒక్కోగేదెను రూ. 75 వేల నుంచి రూ.1.10లక్షల వరకు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్ చేయూత కింద ఒక్కో యూనిట్‌కు రూ. 18,750 సాయం అంజేస్తామన్నారు. మిగిలిన మొత్తం బ్యాంకు రుణం సౌకర్యం కల్పిస్తామన్నారు. అదే విధంగా మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న పాల వెల్లువ కేంద్రాలకు పాల సరఫరా పెరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. గంపలగూడెం, వినగడప సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లు సాయి ప్రదీప్, స్వర్ణాంజలి మాట్లాడుతూ పాడిగేదెల పోషణ పట్ల ఉత్సాహం ఉన్న మహిళలను మాత్రమే పథకంలో ఎంపిక చేయాలన్నారు. పశువైద్యాధికారి అభిలాష్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం చిన్న ఆనందం, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెదురు లింగమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

తిరువూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. నిబంధనల ప్రకారం సెలవులు మంజూరు చేయాలని, మెడికల్ అలవెన్సు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికుల సేవలు క్రమబద్ధీకరించాలని, అదనపు కార్మికులను ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ పరిధిలో చేర్చాలని కోరుతూ నగరపంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

ఎల్బీఆర్‌సీఈ అధ్యాపకుడికి డాక్టరేట్

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మ్యాథ్స్ విభాగంలో అధ్యాపకుడు డి.విజయ్‌కుమార్ రాయలసీమ యూనివర్సిటీ మ్యాథ్స్ విభాగంలో న్యూటోనియన్ ఫ్లూయిడ్ ఫ్లో ప్రొబ్లెమ్స్ ఇన్‌వాల్వింగ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఓవర్ యాన్ ఇన్ఫినైట్ ప్లేట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మంగళవారం తెలిపారు. ఈ పరిశోధనను డాక్టర్ సీహెచ్. వి. రమణమూర్తి, ప్రొఫెసర్ ఆఫ్ మ్యాథ్స్ విభాగం కే.యల్, యూనివర్సిటీ వడ్డేశ్వరం పర్యవేక్షణలో చేశారు. ఈ పరిశోధనలో న్యూటానియన్ ఫ్లూయిడ్ లక్షణాలను వివిధ పరిస్థితుల్లో విశదీకరించారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న డాక్టర్ విజయ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, అధ్యాపకులు అభినందించారు.

చదువుపై దృష్టి సారించాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్

నూజివీడు: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయని, విద్యార్థులు తమ దృష్టినంతా చదువుపైనే ఉంచి పట్టుదలతో లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని వెంకటాద్రిపురంలోని నూజివీడు పాలిటెక్నిక్ కళాశాలలో మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటైతే నాడీ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చే బాధ్యత పిల్లలపై ఉందన్నారు. విద్యార్థులు మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. ప్రతిభావంతులకు మంచి ఉద్యోగాలు ఎప్పుడూ ఎదురు చూస్తూనే ఉంటాయన్నారు. రూరల్ సీఐ రాజులపాటి అంకబాబు, ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

డైవర్షన్ రహదారిపై రాకపోకలు ప్రారంభం



కట్టలేరు వద్ద మరమ్మతులు నిర్వహించిన డైవర్షన్ రహదారి

గంపలగూడెం: గంపలగూడెం మండలం తోటమూల-వినగడప గ్రామాల నడుమ కట్టలేరు వద్ద డైవర్షన్ రహదారిపైన మంగళవారం రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఎగువ తెలంగాణ ప్రాంతంలో గతవారం కురిసిన అధిక వర్షాలకు ఏటిలో వరద ఉద్ధృతి కారణంగా ఏటి వద్ద 300 మీటర్ల పొడవున ఉన్న డైవర్షన్ రహదారి ధ్వంసమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్‌చే డైవర్షన్ రహదారి మరమ్మతులను యుద్ధప్రాతిపదికన సోమవారం చేపట్టి మంగళవారానికి పూర్తి చేశారు. దీంతో ఎనిమిది రోజులుగా నిలిచిపోయిన రాకపోకలు ప్రారంభమయ్యాయి.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడిలో అభివృద్ధి పనులకు ఎంపీపీ పాలడుగు జోత్స్న మంగళవారం భూమిపూజ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామంలో పర్యటించిన ఆమెకు స్థానికులు రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదని వివరించారు. స్పందించిన ఆమె ఎంపీపీ నిధులు రూ.9లక్షలు కేటాయించి ఏఈ శ్రీనివాస్‌తో అంచనాలు వేయించి పనులు ప్రారంభించారు. గ్రామంలో రైతుల ప్రయోజనార్థం తూర్పు డొంక రోడ్డును రూ.6లక్షల వ్యయంతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గతంలో రైతుల కోరిక మేరకు పడమటి డొంకరోడ్డు రూ.13లక్షల వ్యయంతో అభివృద్ధి చేశారు. వైస్ ఎంపీపీ బండి నాగమణి, సర్పంచ్ నాగరాజు, నాయకులు పాలడుగు దుర్గాప్రసాద్, దుర్గారావు, బండి వెంకటరావు పాల్గొన్నారు.

వసతులు సంతృప్తికరం



చిన్నంపేట హైస్కూల్లో వసతులను పరిశీలిస్తున్న ప్రభాకర్

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట జెడ్పీ హైస్కూల్లో కల్పించిన వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని ఇంటర్మీడియట్ బోర్డు ఎడ్యుకేషన్ అధికారి బి.ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్లో కో-ఎడ్యుకేషన్ జూనియస్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు హైస్కూల్లో వసతులను ఆయన మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తరగతి చదువులకు తరగతి గదులు, ప్లే గ్రౌండ్, టాయిలెట్స్ అన్ని వసతులు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. ఇంటర్ చదువులకు సంబంధించి అన్ని వసతులు కల్పిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను కాలేజీలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బీఎస్‌వీ బ్రహ్మాచారి, హెచ్‌ఎం దాసరి శ్రీహర్ష, పీఏసీఎస్ చైర్మన్ పరసా చెన్నారావు, విద్యా కమిటీ చైర్మన్ చింతా ఏసుబాబు పాల్గొన్నారు.

రూ.10వేల తక్షణ సాయం

నూజివీడు: ఆగిరిపల్లికి చెందిన బండారు గోపాలకృష్ణ ఇటీవల గుండెపోటుతో మరణించిన నేపథ్యంలో వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ సాయంగా రూ.10వేల ను మంగళవారం మృతుడి భార్యకు ఎంపీటీసీ సభ్యు డు సాధం గోపీనాథ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస రావు, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

మచిలీపట్నం బస్‌సర్వీసు పునరుద్ధరణ

తిరువూరు: ఇటీవల రద్దుచేసిన మచిలీపట్నం ఎక్స్‌ప్రె స్ సర్వీసును మంగళవారం పునరుద్ధరించారు. ఉద యం 5.30గంటలకు తిరువూరులో బయల్దేరే ఈ బ స్సు సర్వీసును రద్దు చేయడంతో జిల్లా కోర్టుకు వెళ్లే న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బంది పడుతున్నారని పలువురు బార్ అసోసియేషన్ చేసిన విజ్ఞప్తి మేరకు తిరిగి ప్రారంభించారు.

ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ తనిఖీ



ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీసీపీ విశాల్‌గున్నీ, పక్కన సీఐ శ్రీను

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ విశాల్‌గున్నీ మంగళవారం తనిఖీ చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రధాన పోలీస్‌స్టేషన్లతనిఖీల్లో భాగంగా సందర్శించినట్లు తెలిపారు. రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు నెలల్లో 1,170 కేసులు నమోదు చేశామన్నారు. 480మంది నిందితులను అరెస్ట్ చేయగా, ఏడుగురిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే 24 మందిని నగరం నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. సీపీ టీకే రాణా పర్యవేక్షణలో ఇతర జిల్లాల్లో ఉన్న నిందితుల గాలింపునకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి రవాణా నివారణకు సీపీ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సీఐ పి.శ్రీను, ఎస్సైలు పాపారావు, మణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు మేలు



తిరువూరు మండలం మల్లేలలో తల్లిపాల వారోత్సవం



గంపలగూడెంలో తల్లిపాల విశిష్టత తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తిరువూరు: నవజాత శిశువులకు తల్లిపాల ఆవశ్యకత వివరిస్తూ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు అవగాహన కల్పించారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి అపారంగా ఉంటుందని, అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పడితే మేలు చేస్తుందని పేర్కొన్నారు. పట్టణంలోని వార్డు సచివాలయాల పరిధిలో అవగాహన సమావేశాలు జరిగాయి.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: పుట్టిన బిడ్డలకు గంటలోపు తల్లిపాలు ఇస్తే అమృతంలా పని చేస్తాయని మైలవరం సీడీపీఓ పుష్పలత అన్నారు. ఇబ్రహీంపట్నంలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం ఆమె ప్రారంభించారు. సూపర్‌వైజర్ రమాదేవి, ఎమ్మెస్కేలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


గంపలగూడెంలో..

గంపలగూడెం: అధిక పోషకాలు ఉన్నముర్రుపాలను బిడ్డకు పుట్టిన వెంటనే తప్పనిసరిగా పట్టాలని ఐసీడీఎస్ కార్యకర్తలు సూచించారు. గంపలగూడెం పట్టణంలోని 60వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

మల్లేలలో..

మల్లేల(తిరువూరురూరల్): మండలంలోని మల్లేలలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ప్రారంభించారు. మల్లేల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ సమావేశం నిర్వహించారు. చిన్నారులకు తల్లిపాలు ఎంతో మేలని, పోతపాలను ప్రోత్సహించవద్దని వారు సూచించారు.

మణిపూర్‌లో ఘటనలను నిరసిస్తూ శాంతి ర్యాలీ



మైలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాలు

నూజివీడు: మణిపూర్‌లో జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆగిరిపల్లి మండల పాస్టర్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని సంస్థల క్రైస్తవ సంఘాలు, దళిత సంఘాలు ఐక్యంగా ఆగిరిపల్లి ప్రధాన వీధుల్లో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ కూడలి, యూనియన్ బ్యాంక్ కూడలి, అంబేడ్కర్ విగ్రహం దగ్గర, బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించి, మోకాళ్లపై నిలబడి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉదయ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కే చినబాబు, కే దైవ నిరీక్షణ కుమార్, కే పాల్ రమేష్, కే ఐజాక్ జాన్, సాల్మన్ రాజ్, జి జార్జి, పల్లగాని నిరీక్షణ రావు, ఎస్ ఎలీషా, ఫాదర్ అల్లం ప్రతాప్ రెడ్డి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్ పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: మణిపూర్‌లో జరిగిన దాడులు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉందని క్రైస్తవ సంఘాల నాయకులు బి. ప్రతాప్ తెలిపారు. మణిపూర్‌లో జరిగిన ఘటనకు నిరసనగా మైలవరంలో క్రైస్తవ సంఘాలు ఐక్య సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు.

లైసెన్స్ ఫీజులపై అజ్ఞాత వ్యక్తిని నమ్మకండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ, ఇబ్రహీంపట్నం పరిధిలో వ్యాపార దుకాణాల లైసెన్స్ ఫీజలు ఫోన్‌పే ద్వారా చెల్లించాలని ఫోన్ చేస్తున్న అజ్ఞాత వ్యక్తి మాటలు నమ్మవద్దని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. వ్యాపార లైసెన్స్ ఫీజు ఫోన్ పే ద్వారా చెల్లించాలని ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేస్తున్నట్లు కొంతమంది వ్యాపారులు తమ దృష్టికి తెచ్చారన్నారు. మున్సిపాల్టీలో పరిచయం ఉన్న వ్యక్తులు మీవద్దకు వస్తేనే లైసెన్స్ ఫీజులు చెల్లించాలని లేదా నేరుగా కార్యాలయంలో సంబంధిత అధికారులకు మాత్రమే లైసెన్స్ ఫీజులు చెల్లించి రశీదు పొందాలన్నారు. పరిచయం లేని అజ్ఞాత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై కరపత్రాలను ఆవిష్కరించిన ఎంపీడీఓ

తిరువూరు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని తిరువూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై రూపొందించిన కరపత్రాలను తిరువూరులో మంగళవారం ఆవిష్కరించారు. ఇటీవల కురిసిన వర్షాలతో కళ్లకలక, విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, దోమకాటు బారిన పడకుండా వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. జేవీవీ ప్రతినిధులు గంగాధర్, హరికృష్ణ, రాంప్రదీప్, సుదర్శన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని ఈదులగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు తమ కుమార్తెను దారుణంగా కొట్టాడని పేర్కొంటూ అదే పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థిని తండ్రి మంగళవారం ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో, ఎంఈఓ-2 ఆనంద్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ పాఠశాలకు ఇటీవల వచ్చిన ఉపాధ్యాయుడు పిల్లలను కొడుతుంటే వారు బడికి వెళ్లడానికి భయపడుతున్నారని పేర్కొన్నారు. ఇదివరకు కూడా తమ కుమార్తెను కర్రతో కొట్టాడని, పాఠశాల హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లి పద్ధతి మార్చుకోవాలని కోరామన్నారు. ఇక నుంచి కొట్టకుండా చూసుకుంటానని హెచ్‌ఎం హామీ ఇచ్చారన్నారు. గతనెల 31న తమ కుమార్తెను ఉపాధ్యాయుడు కొట్టడంతో ఎడమ వైపు చెవికి గాయమవడంతో వినికిడి లోపించిందని, దీని పై మాజీ సర్పంచి వెంకటసుబ్బయ్యతో కలిసి పాఠశాలకు వెళ్లి అడగ్గా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆరోపించారు. తన కుమార్తెను కొట్టిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.